నకిలీ మద్యం స్కామ్..

సీబీఐకి అప్పగించాలని డిమాండ్



ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

- ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

పాతపట్నం: రాష్ట్రంలో నకిలీ మద్యం తాగి ఇప్పటికే ఎంతో మంది బలయ్యారని, ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. పాతపట్నం నియోజక వర్గ కేంద్రంలో కూటమి ప్రభుత్వం మద్యం విధానాలకు వ్యతిరేకంగా రెడ్డి శాంతి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం బస్టాండ్ వద్ద నుంచి పార్టీ నాయకులతో కలిసి సోమవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి అనుమతిలేదంటూ పాతపట్నం సీఐ ఎస్.సన్యాసినాయుడు పోలీసులతో వచ్చి అడ్డుకున్నారు. పోలీసులు, వైఎస్సార్‌సీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం సమీపం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు నినాదాలు చేసుకుంటూ వెళ్తుండగా మరోసారి పోలీసులు అడ్డుకున్నారు. రెడ్డి శాంతి, కొద్ది మంది నాయకులు ఎక్సైజ్ స్టేషన్ చేరుకున్నారు. నకిలీ మద్యంపై సీబీఐ దర్యాప్తు చేయించాలని సీఐ కె.కృష్ణారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డి శాంతి మాట్లాడుతూ.. పాతపట్నం మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావును మహిళలు వేడుకున్నప్పటికీ ఇంతవరకు తొలగించలేదన్నారు. ఎమ్మెల్యే మద్యం వ్యాపారం చేయడం వల్లే ఆ షాపును తొలగించడం లేదని ఆరోపించారు. నకిలీ మద్యానికి కేరాఫ్‌గా ఆంధ్రప్రదేశ్‌ను కూటమి నాయకులు తయారు చేశారన్నారు. హిర మండలం మాజీ జెడ్పీటీసీ లోలుగు లక్ష్మణరావు, ఎల్.ఎన్.పేట ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షులు సవిరిగాన ప్రదీప్, మీసాల రామకృష్ణ, గండివలస ఆనంద్, పోలాకి జయమునిరావు, పెనుమజ్జి విష్ణుమూర్తి, రాష్ట్ర కార్యదర్శి జి.యోగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి సాంబమూర్తి, రెడ్డి రామారావు, పల్లి యోగి, ఆర్టీఐ అధ్యక్షుడు ఎనుగుతల సూర్యం, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ, ఎ.వి.సురేష్, యరుకోల వెంకటరమణ, దువ్వారి జోగారావు, తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సీఐ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డి శాంతి, నాయకులు

చింతాడ రవికుమార్, పార్టీ నాయకులను అడ్డుకున్న పోలీసులు



కల్తీ మద్యం తయారీలో.. టీడీపీ నాయకుల హస్తం..!

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

ఆమదాలవలస: కల్తీ మద్యంపై సీబీఐ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం ఆమదాలవలస పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి మీదుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. పట్టణ ప్రధాన రహదారి, రైల్వే స్టేషన్ కూడలి, కృష్ణాపురం జంక్షన్ నుంచి మెట్టక్కివలస మీదుగా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. కొద్ది మంది మాత్రమే లోపలికి వెళ్లాలని పోలీసులు చెప్పారు. దీంతో కొద్ది సయమం పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. ఎక్సైజ్ సీఐ జి.సతీష్‌కుమార్‌కు రవికుమార్, నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కల్తీ మద్యంపై ప్రభుత్వ పాత్ర ఉందన్న అనుమానాలు కలుగుతున్నాయన్నారు. చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి నియోజకవర్గ పరిధిలోని ములకలచెరువులో టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన నకిలీ మద్యం స్థావరాలు ఆ పార్టీ పెద్దల కనుసన్నల్లోనే జరిగాయని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడిగా సిట్‌ను ఏర్పాటు చేశారని, సిట్ ఆయన జేబులోని సంస్థని, కేసును నీరుగార్చేందుకు ఇలా చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబుకు ప్రజల ప్రాణాల పట్ల చిత్తశుద్ధి ఉంటే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం మొత్తం కల్తీ మద్యం ఘటనలు వెలుగు చూశాయని, ప్రభుత్వ ఉదాసీనత కారణంగానే కుటీర పరిశ్రమలుగా తయారయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, నాయకులు, వివిధ విభాగాలకు చెందిన కార్యవర్గ సభ్యులు ఖండాపు గోవిందరావు, కొంచాడ రమణమూర్తి, దుంపల శ్యామలరావు, అత్తులూరి రవికాంత్, ఎం.గోపాలకృష్ణ, గురుగుబెల్లి శ్రీనివాసరావు, పొడుగు శ్రీనివాసరావు, పొన్నాడ చిన్నారావు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

ఎక్సైజ్‌శాఖ మంత్రిని తొలగించాలి



వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద కూటమికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కృష్ణచైతన్య, పార్టీ శ్రేణులు

- కల్తీ మద్యంపై సీబీఐ విచారణ చేపట్టాలి
- ర్యాలీ నిర్వహించిన ధర్మాన కృష్ణచైతన్య, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

నరసన్నపేట: కల్తీ మద్యం వ్యవహారంపై నిజానిజాలు నిగ్గు తేలాలంటే ముందుగా ఎక్సైజ్ శాఖ మంత్రిని బర్తరఫ్ చేసి సీబీఐతో దర్యాప్తు చేయిస్తే వాస్తవాలు బయటకు వస్తాయని పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య డిమాండ్ చేశారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నరసన్నపేటలో కృష్ణచైతన్య ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ చేపట్టారు. పార్టీ కార్యాలయానికి వర్షంలోనే కార్యకర్తలు, నాయకులు చేరుకున్నారు. కూటమి పాలన, కల్తీ మద్యం వ్యవహారంపై నినాదాలు చేశారు. ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ.. నారావారి కల్తీ మద్యం ఇప్పటికే అన్ని చోట్లకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. మద్యం విధానాన్ని గతంలో నిర్వహించినట్లు ఈ ప్రభుత్వమూ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాడవాడలా బెల్ట్ షాపులు వెలశాయన్నారు. ప్రజలకు తాగునీరు లభ్యం కాకపోయినా మద్యం మాత్రం ఇంటింటికీ డోర్ డెలివరీ అవుతుందని, ఈ ఘనత కూటమి ప్రభుత్వానిదేనని విమర్శించారు. అనంతరం ఎక్సైజ్ సీఐ లీలారాణికి వినతిప్రతం అందజేశారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట, జలుమూరు ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, పోలాకి మండల ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగినాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు దోమ మన్మథరావు, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సారవకోట మండల పార్టీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కనపల శేఖరరావు, పార్టీ నాయకులు దండి జయప్రకాశ్, యాబాజి రమేష్, సురంగి నర్సింగరావు, సతివాడ రామినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ సంఘాల మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సీఐ లీలారాణికి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణచైతన్య, నాయకులు

క్లుప్తంగా

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువత

హిరమండలం: స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిరమండలంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 42 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శ్రీరామ డెంటల్ క్లినిక్ డాక్టర్ సలాన శరత్‌బాబుతోపాటు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు నేతృత్వంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 290 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. ఉన్నత వైద్యం అవసరమైన వారికి సిఫారసు చేశారు. పోతురాజు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రక్తదానం.. ప్రాణదానంతో సమానమని శ్రీధర్ అన్నారు.

52 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సారవకోట: మండలంలోని బొంతు పీహెచ్‌సీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 52 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. మాజీ జెడ్పీటీసీ చిన్నాల రామసత్యనారాయణ జ్ఞాపకార్థం కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు జాన్ జాక్సన్ కంటి పరీక్షలు నిర్వహించారని, 36 మందికి శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేసినట్లు చల్లా ఆనందరావు, శోభనాపురం మురళి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జన్ని సంధ్యారాణి, మాజీ సర్పంచ్ బాద్ర లక్ష్మీనారాయణ, బొంగు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా



కాంస్య పతకాలు పొందిన విద్యార్థులు

నరసన్నపేట: ఈ నెల 11, 12వ తేదీల్లో ఛత్తీష్‌గఢ్‌లోని దుర్గ్‌లో 13వ జాతీయ స్థాయి గట్కా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మండలానికి చెందిన 8 మంది విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. సత్యవరం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాఘవ, చైతన్య, శరత్, పుష్ప, స్థానిక బోర్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన కీర్తిక, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన కృష్ణ, వంశీ, హర్ష రాష్ట్రం తరఫున పాల్గొని సత్తా చాటారు. విద్యార్థులను ఎంఈఓలు శాంతారావు, దాలినాయుడు, హెచ్ఎంలు వకులా రత్నమాల, శ్రీనివాసరావు, పీఈటీ జ్యోతీరాణి సోమవారం అభినందించారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు

పొందూరు: మండల కేంద్రంలోని 241 సర్వే నంబర్‌లో ఉన్న శాలిహుండం ట్రస్టు భూమి ఆక్రమణకు గురైందని స్థానిక పోలీసు స్టేషన్, రెవెన్యూ కార్యాలయంలో ట్రస్టు చైర్మన్ మధురెడ్డి సోమవారం ఫిర్యాదు చేశారు. సంబంధిత భూమిలో పొందూరుకు చెందిన వ్యక్తి జేసీబీలతో చదును చేశాడని చెప్పారు. ఎటువంటి లీజు లేకుండా సుమారు 50 సెంట్లను అనధికారికంగా చదును చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అంధకారం..

- విద్యుత్ దీపాలు లేని తిలారు ఫ్లై ఓవర్
- రాత్రి వేళలో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



విద్యుత్ దీపాలు లేక చీకటిగా ఉన్న ఫ్లై ఓవర్

జలుమూరు: తిలారు జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైన నిర్మించిన ఫ్లై ఓవర్ ప్రమాదకరంగా మారింది. విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి ఆరు గంటలు దాటితే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించి వంతెన నిర్మాణం పూర్తిచేశారు. వినియోగంలోకి వచ్చి ఏడాది దాటుతోంది. విద్యుత్ దీపాలు అమర్చకపోవడంతో వంతెనపై ప్రయాణం చేయాలంటే భయంతో వణికిపోతున్నారు.

నిత్యం వేలాది మంది ఇదే వంతెనపై రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. శ్రీకాకుళం, పాతపట్నం, టెక్కలి పర్లాకిముండి, శ్రీముఖలింగం తదితర ప్రాంతాలకు రోజూ వేలది వాహనాలు ఇదే వంతెన పైనుంచి వెళ్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి వంతెనపై విద్యుత్ దీపాలు పెట్టాలని పలువురు కోరుతున్నారు.

దీనిపై జాతీయ రహదారులు డిప్యూటీ డీఈఈ కె.సత్యభాస్కర్ మాట్లాడుతూ.. పంచాయతీ తీర్మానం ఆలస్యంగా ఇవ్వడంతో దీపాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇటీవల తీర్మానం వచ్చిందని, వంతెనపై త్వరలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు.

రాత్రిపూట భయం వేస్తోంది.



రాత్రిపూట అయితే చాలు ఈ వంతెనపై నుంచి ప్రయాణం చేయాలంటే భయం వేస్తోంది. చీకటిగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. వెంటనే విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలి.

– మామిడి భానుమూర్తి, ప్రయాణికుడు, ఊడికలపాడు

వంతెనపై ప్రయాణమంటే వణకు



రాత్రిపూట వంతెనపై ప్రయాణం అంటే వణుకు పుడుతోంది. నిత్యం నరసన్నపేట నుంచి తమ వ్యాపారానికి సామాన్లు, ఇతర వస్తువులు ఆటో, ద్విచక్ర వాహనంపై తెస్తుంటాను. రాత్రి సమయంలో వంతెన వద్దకు వచ్చేసరికి ఇబ్బంది పడాల్సివస్తోంది.

– పూజారి తులసీరావు, చిరు వ్యాపారి, గంగాధరపేట

కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి: క్షేత్రస్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేసి, కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. సోమవారం సుసరాం గ్రామంలో సుసరాం, చెల్లాయివలస, ప్రియాగ్రహారం పంచాయతీ కార్యకర్తలతో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మద్యం సిండికేట్, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ, అమలుచేయని సూపర్‌సిక్స్ హామీలు వంటి అంశాలతో ఈ ప్రభుత్వం ప్రజల్లో చులకనైందన్నారు. ప్రశ్నించేవారి గొంతు నొక్కుతున్న వైనం గురించి సోషల్ మీడియాలో ప్రతి కార్యకర్త స్పందించాలని, అప్పుడే ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయన్నారు. మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగి నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కణితి కృష్ణారావు, పార్టీ నాయకులు దుంపల ఆనందరావు, చింతు రాఘవరావు, చింతాడ ఉమ, చింతు రామకృష్ణ, సుంకరి రాంబాబు, కె.లక్ష్మణరావు, దంత రమణ, దుంపల నరేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

వైఎస్సార్‌సీపీ, టీడీపీ మధ్య వాగ్వాదం

సరుబుజ్జిలి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరయ్యారు. మండలంలోని ప్రతీ పంచాయతీ విషయంలో పెద్ద సవలాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఆర్టీఐ వింగ్ సెక్రటరీ బద్రి రామారావు తలదూర్చుతున్నారని ఇస్కలపాలెం సర్పంచ్ పల్లె సురేష్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. బద్రి రామారావుకి వ్యక్తిగత పనులు ఉంటే చేయండని, మర్యాదలు చేస్తే అధికారులు ఇబ్బంది పడతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. రామారావుకి ఈ సమాచారం చేరింది. వ్యక్తిగతంగా దుర్భషలాడడం ఏమిటని, ఏదైనా బయటకువచ్చి మాట్లాడాలన్నారు. సమావేశం ముగిసిపోవడంతో ఎమ్మెల్యే బయటకు వచ్చారు. రామారావు ఎంపీపీ చాంబర్‌లోకి వెళ్లిపోయారు. ఎంపీపీ చాంబర్ వైపు ఎమ్మెల్యే వెళ్లే సమయంలో అక్కడే ఉన్న పోలీసులు వద్దని వారించారు. ఇరుపక్షాలను పోలీసులు కార్యాలయం బయటకు పంపించేశారు.



ఇరువర్గాల మధ్య వాగ్వాదం

పనిచేయని అధికారులపై చర్యలు

విధి నిర్వహణలో బాధ్యతగా లేని అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి పనితీరు సక్రమంగాలేదని సభ్యులు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. పనితీరు మార్చుకోవాలని ఏఓను ఎమ్మెల్యే హెచ్చరించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎమ్మెల్యే అడ్డుకోవడం వలన అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు ప్రశ్నించారు. ఎంపీపీ కిల్లి రమాదేవి, మండల ప్రత్యేకాహ్వానితుడు కె.వి.జి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరావు, వైస్ ఎంపీపీలు జి.వి.శివానందమూర్తి, అనిల్‌కుమార్, ఎంపీడీఓ ఎం.పావని, తహసీల్దార్ మధుసూదన, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యులకు సంఘీభావం



సారవకోటలో నల్ల రిబ్బన్లతో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

సారవకోట: పీహెచ్‌సీల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు గత నెల నుంచి తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నిరసన తెలియజేస్తున్నారు. ఈ నిరసనకు సంఘీభావంగా సారవకోట, బొంతు పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది నల్ల రిబ్బన్లు పెట్టుకుని సోమవారం విధులకు హాజరయ్యారు.

సంక్షిప్తంగా..

తూర్పుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాసరావు



పాతపట్నం: రాష్ట్ర తూర్పుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా పాతపట్నానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు నాగులపల్లి శ్రీనివాసరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం తూర్పుకాపు రాష్ట్ర కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గంలో తనను నియమించిన జాతీయ అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్‌కు ధన్యవాదాలు తెలిపారు. శ్రీనివాసరావుకు పాతపట్నం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

పుస్తకాల వితరణ

హిరమండలం: విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని ఎంఈఓ రాంబాబు సూచించారు. సోమవారం జలుమూరు మండలం యలమంచిలికి చెందిన జుత్తు జగన్న మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పోటీ పరీక్ష ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను ఎంఈఓ ఆవిష్కరించారు. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో హిరమండలం, పాతపట్నం, ఎల్ఎన్ పేట, సరుబుజ్జిలి, జలుమూరు మండలాలకు 39 పుస్తకాలను వితరణ చేశారు.

14న ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం

పొందూరు: స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆడపిల్ల సేవా సొసైటీ ఆధ్వర్యంలో స్థానిక సిస్టం డిగ్రీ కళాశాలలో ఈ నెల 14వ తేదీ నుంచి వివిధ పోటీ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు. ఈ మేరకు సొసైటీ నిర్వాహకురాలు ఎం.లావణ్య సోమవారం తెలిపారు. 38 రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ప్రతీరోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఇంగ్లీషు కమ్యూనికేషన్, అర్థమెటిక్స్, రీజనింగ్‌లో కోచింగ్ ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 91210 38589ను సంప్రదించాలన్నారు.

నగదు ప్రోత్సాహకం అందజేత

హిరమండలం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2024–25లో పదో తరగతిలో ప్రథమంగా నిలిచిన షర్మిలా పూజితకు (582 మార్కులు) రూ.10 వేలను పూర్వ విద్యార్థి కంచి వెంకట కూర్మనాథ్ సోమవారం అందించారు. ఏటా లక్ష్మీదేవి మెమొరియల్ అవార్డు పేరిట నగదు ప్రోత్సహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కేశవరావు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ సింహాద్రి కల్యాణి, జోగారావు, వేణుగోపాలరావు, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు.

బాలియాత్ర ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించాలి

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో నవంబర్ 9వ తేదీన జరగనున్న బాలియాత్రను ప్రభుత్వ కార్యక్రమంగా చేసేందుకు సహకరించాలని యాత్ర నిర్వాహక కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆమదాలవలస, నరసన్నపేట ఎమ్మెల్యేలు కూన రవి కుమార్, బగ్గు రమణమూర్తిని కలిసి వినతిపత్రాలు అందజేశారు. కళింగ రాజ్యం, బాలియాత్ర విశేషాలు, శ్రీముఖలింగం రాజధానిగా రాజుల పాలన, నౌకాయానం, చరిత్ర ఆధారాలు, తదితర విషయాలను వివరించారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు టి.సతీష్ కుమార్, కె.హరిప్రసాద్, వెంకటాచలం, రమణమూర్తి, కొండయ్య, ధనుంజయ పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై దాడి అమానుషం



కొత్తూరు: మాట్లాడుతున్న దళిత సంఘాలు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నేతలు

కొత్తూరు: విధి నిర్వహణలో ఉన్న స్థానిక తహసీల్దార్ కె.బాలకృష్ణ, సిబ్బందిపై దాడి చేయడం అమానుషమని దళిత సంఘం నాయకులు, రెవెన్యూ ఉద్యోగల సంఘం నేతలు అన్నారు. కొత్తూరులోని స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. దాడి చేసిన వ్యక్తులను అరెస్టు చేయాలని కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో టెక్కలి డీఎస్పీ లక్ష్మణరావుకు ఫిర్యాదు చేశారు. దాడి ఘటనపై తహసీల్దార్, రెవెన్యూ సిబ్బందిని విచారించి, వివరాలు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.

నిరసన..

పాతపట్నం: విధి నిర్వహణలో ఉన్న కొత్తూరు తహసీల్దార్‌పై దాడి చేయడం దారుణమని పాతపట్నం తహసీల్దార్ ఎస్.ప్రసాదరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు రెవెన్యూ సిబ్బందితో కలిసి నిరసన తెలియజేశారు.

అధ్వాన దారులు

- వర్షాలకు నరసన్నపేట పట్టణంలోని రోడ్లు ఛిద్రం
- అవస్థలు పడుతున్న స్థానికులు, ప్రయాణికులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలోని పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడిందంటే ప్రయాణం కష్టంగా మారుతోంది. రోడ్లపై నీరు నిల్వ ఉండటంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న రోడ్డు మురుగు కాలువను తలపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే రోడ్డు దారుణంగా తయారైంది. బండి వీధి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గం దుర్గంధభరితంగా ఉంది. నాయుడు వీధి నుంచి భవానిపురం మధ్య రహదారి రూపు కోల్పోయింది. పట్టణ శివారు వీధుల్లో రోడ్లు మరింత అధ్వానంగా ఉన్నాయి. రోడ్లుపై చెత్త ఎక్కడికక్కడ దర్శనమిస్తోంది. దీంతో రోగాలు ప్రబలుతున్నాయి. సోమవారం రాత్రి నుంచి కురిసిన వర్షాలకు రోడ్లు మరింత అధ్వానంగా మారాయి.



బండి వీధి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే మార్గంలో నిల్వ ఉన్న నీరు



నాయుడు వీధి వద్ద నిల్ల ఉన్న మురుగునీరు



ఏరియా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఛిద్రమైన రహదారి

నీరు నిల్వ లేకుండా చూడాలి



వర్షం పడితే రోడ్లు జలమయం అవుతున్నాయి. రోడ్లులో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. వర్షం నీరు రోడ్లుపై నిల్వ లేకుండా చూడాలి. లక్ష్మీనగర్‌తోపాటు శివారు వీధుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

– పాగోటి జానకిరాం, లక్ష్మీనగర్, నరసన్నపేట పట్టణం

దోమలకు నిలయంగా మారాయి



వర్షం నీరు రోడ్లుపై నిల్వ ఉండడంతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బండి వీధి, రాజేశ్వరి థియేటర్ వద్ద వర్షం నీరు నిల్వ ఉంటోంది. కాలేజీ రోడ్డులో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి.

– ఏపీవీ రమణమూర్తి, మారుతీనగర్–7, నరసన్నపేట పట్టణం

మండల సమావేశం రేపు

కొత్తూరు: ఈ నెల 15వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ వి.నీరజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షత వహిస్తారన్నారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.